క్లుప్తంగా

అమ్మవార్లకు ఘనంగా తిరువీధి



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో కొలువైన సింహవల్లీ తాయారు, చతుర్భుజ తాయారు అమ్మవార్లకు శుక్రవారం విశేషంగా తిరువీధి జరిగింది. అమ్మవార్ల ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి పల్లకిలో వేంజేపచేశారు. సాయంత్రం ఆలయ బేడామండపంలో తిరువీధి నిర్వహించారు. పెద్ద ఎత్తున హారతులు అందించారు.

స్కూళ్ల సందర్శనలో డైట్ అధ్యాపక బృందం



పరవాడ బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో భీమిలి డైట్ అధ్యాపక బృందం

పరవాడ: చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భీమునిపట్నం డైట్ కళాశాల సీనియర్ లెక్చరర్ బి.సునీత సూచించారు. మండలంలోని పలు స్కూళ్లను డైట్ అధ్యాపక బృందంతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎప్పటికప్పుడు నోట్ పుస్తకాలను దిద్ది తప్పులను సవరించాలన్నారు. విద్యార్థుల అభ్యసన తీరు, ఉపాధ్యాయుల బోధనా విధానాలు, తరగతుల నిర్వహణ, మ. ధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. పలు సూచనలిచ్చారు. బృందంలో డైట్ లెక్చరర్లు కె.శాంతి, ఆర్.సుధ లక్ష్మి, ఎంఏ ఆశ ఉన్నారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్ సందర్శన



పెందుర్తి హైస్కూల్లో ఏటీఎల్‌ను పరిశీలిస్తున్న సుదర్శన్, తదితరులు

పెందుర్తి: భవిష్యత్‌లో అటల్ టింకరింగ్ ల్యాబ్ (ఏటీఎల్)ల ద్వారా విద్యార్థులు సృజనాత్మక ఆవిష్కరణలు చేసేలా ఉపాధ్యాయులు సన్నద్ధం చేయాలని యునిసెఫ్ రాష్ట్ర కన్సల్టెంట్ సుదర్శన్ సూచించారు. పెందుర్తిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆయన ఏటీఎల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చిన్నమ్మాయి, సైన్స్ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



శంకుస్థాపనలో సర్పంచ్ నాగమణి

పరవాడ: మండలంలోని పెదముషిడివాడ గ్రామంలో పంచాయతీ నిధులు రూ.5 లక్షలతో చేపట్టనున్న సీసీ రహదారికి సర్పంచ్ పల్లా నాగమణి శుక్రవారం శంకుస్థాపన చేశారు. గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పల్లా అప్పారావు(కబడ్డీ), యలమర్తి బుజ్జి, పల్లా వెంకటలక్ష్మి, సీర పైడమ్మ, మాజీ ఎంపీటీసీ పల్లా వెంకునాయుడు, కలవలపల్లి సత్యనారాయణ, బర్ల వెంకయ్యనాయుడు, దాలిబోయిన పైడిరాజు, బోడి నాగేష్ పాల్గొన్నారు.

వృద్ధురాలి నేత్రదానం



నూకాలమ్మ(ఫైల్)

పెందుర్తి: స్థానిక ద్రోణంరాజునగర్‌లో ఆడారి నూకాలమ్మ(75) గురువారం మరణించింది. సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చొరవతో ఆమె నేత్రాలను అవసరమైన వారికి దానంచేసి, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు కుటుంబం సభ్యులు ముందుకొచ్చారు. ఎల్‌వీ ప్రసాద్ మెుహిషిన్ ప్రతినిధి కృష్ణ ఆమె నేత్రాలను సేకరించారు. మృతురాలు నూకాలమ్మకు ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు. కొడుకు శంకరరావు తాపీ మేస్త్రి కాగా, కూతుళ్ల కొడుకు వద్దే ఉంటున్నారు.

మహిళ అదృశ్యంపై కేసు



వరలక్ష్మి

పెందుర్తి: మహిళ అదృశ్యంపై పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పెందుర్తి దరి అయ్యప్పనగర్‌లో మొల్లేటి వరలక్ష్మి (58) ఒంటరిగా నివసిస్తోంది. శ్రీకాకుళం జిల్లా సోంపేటలో కేర్ టికర్‌గా పనిచేస్తోంది. 15 రోజుల క్రితం డ్యూటీకి వెళ్లింది. ఈ నెల 17న ఆరోగ్యం బాగాలేక అయ్యప్పనగర్‌లోని తన ఇంటికి వచ్చింది. కేజీహెచ్‌కు వెళ్తున్నానని, మీరు రండి అని కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి చెప్పింది. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో.. కుటుంబ సభ్యులు గాలించారు. అయినా ఆచూకీ దొరకలేదు. దీంతో పోలీస్ స్టేషన్‌లో వరలక్ష్మి కుమార్తె విల్లూరి దేవి ఫిర్యాదు చేయగా సీఐ కె.వి.సతీష్‌కుమార్ మిస్సింగ్ కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ బి.అప్పారావు దర్యాప్తు చేస్తున్నారు. వరలక్ష్మి ఆచూకీ తెలిసినవారు 96767 97314,, 94407 96039 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జగనన్న కాలనీలపై కూటమి శీతకన్ను!



వీధి కాలువలు లేని వెన్నలపాలెం జగనన్న కాలనీ

- కనీస వసతులపై దృష్టి సారించని ప్రభుత్వం
- రోడ్లు, కాలువలు లేకపోవడంతో ఇబ్బందులు
- తాగునీటికి కటకటలాడుతున్న కాలనీల ప్రజలు

పేదల సొంతింటి కల నెరవేర్చాలనే సంకల్పంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న కాలనీలను ఏర్పాటు చేసింది. పరవాడ మండలంలో తిక్కవానిపాలెం, వెన్నలపాలెం, కలపాక, పరవాడ గ్రామాల్లో వందల సంఖ్యలో ప్లాట్లు కేటాయించి, ఇళ్ల నిర్మాణాలకు సాయపడింది. మౌలిక సదుపాయాలు పూర్తిచేసే క్రమంలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో కాలనీల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నామని ఆయా కాలనీల ప్రజలు వాపోతున్నారు.



తుప్పలు డొంకలతో విష జంతువులకు ఆవాసాలుగా మారిన కలపాక జగనన్న కాలనీ

పరవాడ: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మండలంలో పేదలకు పక్కా గృహాల నిర్మాణం కోసం 8 లేఅవుట్లను ఏర్పాటు చేసింది. అందులో 1568 ప్లాట్లు వేసి, అర్హులైన 809 మందికి ఇళ్లను మంజూరు చేసింది. ఇప్పటి వరకు 446 మంది సొంతిళ్లు నిర్మించుకుని నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. మరి కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. అయితే ఇక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకున్న ప్రజలకు కనీస వసతులు కల్పించకుండా ప్రస్తుత కూటమి ప్రభుత్వం వేధిస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారులు, తాగునీరు, వీధి రోడ్లు, కాలువలు వంటి కనీస వసతులు కల్పించడంలో చొరవ చూపట్లేదని ఆక్షేపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మౌలిక వసతులు పనులు నిలిచిపోయి, ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

లెక్కలేని సమస్యలు

తిక్కవానిపాలెం జగనన్న కాలనీకి ఏర్పాటు చేసిన ప్రధాన రహదారి గోతులమయంగా మారింది. చిన్నపాటి వర్షం కురిసినా అవస్థలు వర్ణనాతీతం. వీధి రోడ్లు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఇంటింటి కొళాయిలు వేసినా, వాటికి కనెక్షన్లు ఇవ్వలేదు. పంచాయతీ కరెంట్ బిల్లు చెల్లించలేదని ఫీజులు పీకేయడంతో నాలుగు నెలలుగా వీధి దీపాలు వెలగక చీకటిలో సావాసం చేస్తున్నట్లు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గోతులతో నిండిన తిక్కవానిపాలెం జగనన్న కాలనీ ప్రధాన రహదారి



వెన్నలపాలెం జగనన్న కాలనీలో ఇంటి పక్కన నిలిచిపోయిన మురుగు



కలపాక జగనన్న కాలనీలో అధ్వానంగా మారిన మట్టిరోడ్డు

మురుగుతో ముప్పతిప్పలు

వెన్నలపాలెం జగనన్న కాలనీవాసులను ప్రధానంగా వీధి రోడ్లు, కాలువల సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. వీధి రోడ్లు ఏర్పాటు చేయని కారణంగా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీరు బయటకు పోయే వీల్లేక వాడుక నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. దోమలు పెరిగి విషజ్వరాలు, మలేరియా, డెంగ్యూ జ్వరాల బారినపడి ఆస్పత్రుల పాలవుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు.



తిక్కవానిపాలెం: ఫీజులు తొలగించిన వీధి దీపాలు

జగనన్న కాలనీ 8 లేఅవుట్లలో గృహాలు

గ్రామం	మంజూరైన గృహాలు	నిర్మించిన గృహాలు
ఈ.బోనంగి-1	38	26
ఈ.బోనంగి-2	36	25
పి.బోనంగి-3	74	11
పి.బోనంగి-2	46	19
పరవాడ-1	290	206
పరవాడ-2	88	51
కలపాక	90	39
తిక్కవానిపాలెం	147	69
మొత్తం	809	446

తాగునీటికీ ఇక్కట్లు

కలపాక జగనన్న కాలనీ వాసుల్ని తాగునీరు, వీధి రోడ్లు, కాలువల సమస్యలు వేధిస్తున్నాయి. కాలనీలో ఇంటింటి కొళాయిలు ఏర్పాటు చేసినా, నీటి సరఫరా చేయని కారణంగా మూడు కిలోమీటర్ల దూరంలో ఎన్టీపీసీ యాజమాన్యం ఏర్పాటు చేసిన కొళాయిల నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. చేతి పంపుల నుంచి వచ్చే కలుషిత నీటిని తాగలేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వీధిలైట్లు వెలగట్లేదు



మా కాలనీలో నాలుగు నెలలుగా వీధి దీపాలు వెలగక అవస్థలు పడుతున్నాం. పంచాయతీ కరెంటు బిల్లు కట్టలేదని ఫీజులు తొలగించారు. చీకటి పడితే చాలు ఇళ్లలోకి విష జంతువులు చొరబడుతున్నాయి. మట్టి రోడ్డులో ఏ మాత్రం వర్షం పడినా గోతుల్లో నీరు చేరి ఇబ్బందులు తప్పట్లేదు.

– దూడ మసేనమ్మ, గృహిణి, తిక్కవానిపాలెం

దోమల బెడదతో అనారోగ్యం



జగనన్న కాలనీలో మూడేళ్లుగా ఉంటున్నాం. ఇంత వరకు రోడ్లు, కాలువలు నిర్మించలేదు. వాడుక నీరు బయటకు పోయే మార్గం లేదు. కాలనీలో నిలిచిన మురుగు నీటితో దోమల బెడద ఎక్కువైంది. తరచూ విష జ్వరాల బారిన పడుతున్నాం. కష్టపడిన సొమ్మంతా ఆస్పత్రులకే పోస్తున్నాం.

– కూంద్రపు కుమారి, వెన్నలపాలెం

3 కిలో మీటర్లు వెళ్తేనే తాగునీరు



కాలనీలో తాగునీరు, వీధి రోడ్లు, కాలువలు వంటి వసతులు కల్పించకపోవడంతో అవస్థలు పడుతున్నాం. బోర్లలో కలుషిత నీరు వస్తుండడంతో దప్పిక తీర్చుకునేందుకు మూడు కిలోమీటర్ల దూరంలోని ఎన్టీపీసీ కొళాయిలపై ఆధారపడుతున్నాం. వీధి రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది.

– కురం సత్యవతి, గృహిణి, కలపాక


దుర్గమ్మ మండపాలకు అనుమతులుండాల్సిందే..



సతీష్‌కుమార్, సీఐ

పెందుర్తి: దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండపాల్లు వేసుకోవడానికి, విగ్రహాలు ప్రతిష్టించడానికి కమిటీలు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని పెందుర్తి సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపారు. అనుమతుల కోసం సింగిల్ విండో సిస్టమ్ ఆన్‌లైన్ పోర్టల్ durgautsav.netలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా పందిర్లు వేయడం, విగ్రహాలు పెట్టడం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. డీజే సౌండ్‌లకు ఎలాంటి అనుమతి ఉండదని, అసభ్యకర నృత్యాలు పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు కల్గించకూడదని, రోడ్లపై అడ్డంకులు సృష్టించకూడదని పేర్కొన్నారు. పందిర్లు, మండపాలు ఏర్పాటు చేసేటప్పుడు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని సూచించారు. రాత్రి వేళల్లో నిర్దిష్ట వేళల వరకు మాత్రమే సౌండ్ సిస్టం వినియోగించాలన్నారు. సీసీ టీవీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసుకోవడం మంచిదన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు దృష్టికి వచ్చిన వెంటనే 112 లేదా పెందుర్తి పోలీస్ స్టేషన్(96767973147)కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఔషధ పరిశ్రమ ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ



శిక్షణలో జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకర్‌రెడ్డి, వివిధ సంస్థల ప్రతినిధులు

పరవాడ: ఔషధ పరిశ్రమల్లో విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులు, కార్మికులు భద్రత ప్రమాణాలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకర్‌రెడ్డి అన్నారు. జేఎన్ ఫార్మాసిటీలో జేఎన్‌పీఎంఏ, ఎంఏఎస్‌ఆర్‌ఎం, బయోకాన్ సంయుక్త ఆధ్వర్యంలో నైపుణ్యాల అభివృద్ధి, నాణ్యత, సేఫ్టీ మేనేజ్‌మెంట్, భద్రత ప్రమాణాలపై ఫార్మా ఉద్యోగులు, కార్మికుల కోసం శుక్రవారం ఏర్పాటు చేసిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. పరిశ్రమల అకడమిక్ అనుసంధానాన్ని బలపరిచేందుకు ఈ తరహా శిక్షణ కార్యక్రమాలు పరిశ్రమలు, కార్మికులకు మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. పరిశ్రమల్లో ప్రాసెస్ సేఫ్టీపై ఉద్యోగులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఎంఏఎస్‌ఆర్‌ఎం కార్యదర్శి జెట్టి సుబ్బారావు మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న మెళకువలను తమ పరిశ్రమల్లో అమలుకు కృషి చేయాలని సూచించారు. బయోకాన్ వైజాగ్ క్లస్టర్ హెడ్ రాజేష్ బహురావ్ ఢీటే, బయోకాన్ సీనియర్ డైరెక్టర్ పి.అమర్‌నాథ్ పాల్గొని ఉద్యోగులకు పలు అంశాలను వివరించారు. శిక్షణ కార్యక్రమంలో వివిధ పరిశ్రమలకు చెందిన 271 మంది పరిశ్రమల నిపుణులు, భద్రత నిపుణులు, ప్రొడక్షన్ మాన్యుఫాక్చరింగ్ కెమిస్టులు, టెక్నాలజీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సైకిళ్ల చోరీతో విద్యార్థుల్లో ఆందోళన



నునపర్తి కూడలిలో పార్క్ చేసిన సైకిళ్లు

పరవాడ: అచ్యుతాపురం-పరవాడ రహదారి నునపర్తి కూడలిలో సైకిళ్ల దొంగతనాలు జోరందుకున్నాయి. పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి బషీర్‌కు చెందిన సైకిల్ గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం దొంగిలించారు. గతంలో కూడా పలువురు విద్యార్థులకు చెందిన సైకిళ్లు చోరీకి గురైనట్లు విద్యార్థులు వాపోతున్నారు. గొల్లగుంట, రావాడ, ఎన్టీఆర్ కాలనీ, గొల్లగరువు, రేకవానిపాలెం ప్రాంతాలకు చెందిన విద్యార్థులు పరవాడ, గాజువాక ప్రాంతాల్లోని విద్యా సంస్థల్లో చదువుతున్నారు. వీరు తమ గ్రామాల నుంచి సైకిళ్లపై వచ్చి నునపర్తి జంక్షన్‌లో రోడ్డు పక్కన వాటిని పార్క్ చేసి, కళాశాలలకు వెళ్లి సాయంత్రం వచ్చి సైకిళ్లపై ఇళ్లకు చేరుకుంటారు. ఇటీవల ఇక్కడ పార్క్ చేసిన సైకిళ్లను అదనుచూసి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించడం పరిపాటిగా మారింది. ఇటువంటి చోరీలను అరికట్టడానికి పోలీసులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

వివాదాలకు కారణమైన వారిపై బైండోవర్

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో స్థల వివాదాలతో ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిస్తున్నవారిపై సీఐ కేవీ సతీష్‌కుమార్ నివేదన మేరకు బైండోవర్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నరవలో ఇటీవల ఒక స్థలం విషయంలో ఇరు పార్టీలకు చెందిన నలుగురు వ్యక్తులు తరుచూ తగాదాలు పెట్టుకుంటున్నారు. స్థానికులకు దైనందిన వ్యవహారాల్లో తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నారు. స్థానిక ప్రజల ఫిర్యాదు మేరకు పలుమార్లు పోలీసులు హెచ్చరించినా వారు తీరు మార్చుకోలేదు. అదే విధంగా పెదగాడిలో ఓ స్థల వివాదంలో నాలుగు పార్టీలకు చెందిన 14 మంది తరచూ ఘర్షణలకు దిగుతున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా వీరిపై బైండోవర్‌కు మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేటైన తహసీల్దార్ ముందు హాజరుపరిచారు. ఆయన కూడా వీరిని తీరు మార్చుకోమని హెచ్చరించారు. అయినా తరచూ వివాదాలతో, ప్రజల్లో ఉద్రిక్త వాతావరణానికి కారకులవుతుండటంతో బైండోవర్ చర్యలకు అభ్యర్థించినట్లు సీఐ తెలిపారు. దీంతో తహసీల్దార్ వెంకటఅప్పారావు సమగ్ర విచారణ చేపట్టారు. విచారణలో వారు వివాదాలకు కారకులవుతున్నారని తేలడంతో వారందరినీ రెండేళ్లపాటు పర్సనల్ బాండ్లపై బైండోవర్ చేశారు. ప్రతి ఒక్కరూ రూ.3 లక్షల మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించుటకు ఆదేశించారు. వీరిలో ఎవరైనా ఇకమీదట ప్రజల శాంతికి భంగం కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు.

సాఫ్ట్‌వేర్ లోపాల సవరణకు దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్



పెందుర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న దస్తావేజు లేఖర్లు



పెన్ డౌన్‌లో భాగంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖర్లు

పెందుర్తి: ఆన్‌లైన్ దస్తావేజు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం పిలుపు మేరకు శుక్రవారం పెందుర్తి దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ చేశారు. సమస్యను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పెందుర్తి దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షుడు పితాని నాగరాజు ఆధ్వర్యంలో లేఖర్లంతా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఆధార్ కార్డు ఓటీపీ, స్థానిక సంస్థల డేటాబేస్ ఆధారంగా ఇంటి రిజిస్ట్రేషన్లు, కార్డుప్రైమ్ సాఫ్ట్‌వేర్‌లోని సాంకేతిక లోపాల వల్ల ప్రజలు, డాక్యుమెంట్ రైటర్లు చాలా ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కార్డు ప్రైమ్ 2.0 ఓటీపీ విధానంలో చాలా సాంకేతిక సమస్యలు వస్తున్నాయని, వీటిని పరిష్కరించాలని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఐజీని కలిసి వినతిపత్రాలు అందించామన్నారు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఓటీపీ విధానంతో దస్తావేజు లేఖర్లను ప్రజలు అనుమానించే పరిస్థితి ఉందన్నారు. సైబర్ క్రైమ్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఓటీపీలు చెప్పొద్దంటూ ఒకవైపు ప్రచారం చేస్తున్న ప్రభుత్వమే.. రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ఓటీపీలు తీసుకురావడం ఎంతవరకు సమంజసమని ఆక్షేపించారు. ఎలాంటి పొరపాట్లు జరిగినా బుక్‌చేసుకున్న స్లాట్ పోతుందని, రిజిస్ట్రార్‌కి కూడా దానిని సరిదిద్దే అధికారం లేదన్నారు. ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే సాఫ్ట్‌వేర్, టెక్నికల్ లోపాలు సరిదిద్దాలన్నారు. శనివారం కూడా పెన్‌డౌన్ కొనసాగుతుందన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన

సబ్బవరం: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శ్రీదుర్గమాంబ దస్తావేజు లేఖర్ల సంఘం ఆధ్వర్యంలో దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు రెండు రోజుల పెన్‌డౌన్ కార్యక్రమంలో భాగంగా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సంఘ ప్రతినిధులు వల్లభజ్యోతుల సీతారామమూర్తి, శేఖరమంత్రి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రిజిస్ట్రేషన్ విధానంలో తీసుకొచ్చిన మార్పులకు తాము వ్యతిరేకం కాదని, అయితే సామాన్యులకు భారీ నష్టం కలిగించేలా ఈ విధానం ఉందని ఆక్షేపించారు.

దీన్ని వెంటనే రద్దు చేసి, ప్రజలకు అనువైన విధానాన్ని అమలు చేయాలన్నారు. ఆందోళనలో సంఘ ప్రతినిధులు బిక్కవోలు రాంబాబు, బోకం పాలవెల్లి, శేఖర్, జూరెడ్డి శ్రీరామమూర్తి, దంతులూరి సురేష్‌వర్మ, ఎస్.రామచంద్రరావు, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు భువన



భువనను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుహాసిని, ఏటీపీ చంద్రకళ

పరవాడ: ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాలో ఈ నెల 23 నుంచి 25 వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీకి తానాం మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల బాలికల కళాశాలకు చెందిన ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి ఆర్.భువన ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎంవైఎస్ సుహాసిని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు భువనను ఆదర్శంగా తీసుకుని, క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా భువనను ప్రిన్సిపాల్‌తో కలిసి ఏటీపీ పి.చంద్రకళ అభినందించారు.

బకాయి జీతాల కోసం ఎండీఎం కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

పరవాడ:

మండలంలోని వాడచీపురుపల్లి జెడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) కార్మికులకు బకాయిపడ్డ మూడు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని సిటు మండల నాయకులు కె.ఆదిలక్ష్మి డిమాండ్ చేశారు. సిటు ఆధ్వర్యంలో ఎండీఎం కార్మికుల పెండింగ్ వేతనాల కోసం శుక్రవారం పాఠశాలలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఎండీఎం కార్మికులకు మూడు నెలల నుంచి జీతాలు, బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కనీస వేతనంగా నెలకు రూ.10 వేలు చెల్లిస్తుందని ఆశించినా ఫలితం కనిపించలేదన్నారు. నిత్యావసర సరకులు, కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో బిల్లులు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎండీఎం అమలు చేసి 20 ఏళ్లు గడస్తున్నా కార్మికుల వేతనాలు గొర్రె తోక బెత్తెడు అన్న చందంగానే ఉందని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కార్మికుల సమస్యలు కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కార్మికులకు హెల్త్‌కార్డులు, యూనిఫాం, గుర్తింపు కార్డుల్ని ఇంతవరకు మంజూరు చేయకపోవడం విచారకరమన్నారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో కె.లక్ష్మి, సత్యవతి, రత్నకుమారి, పైడితల్లి, నూకరత్నం, లక్ష్మి, అనిత, పార్వతమ్మ, దేవి, వెంకటలక్ష్మి, రత్నం పాల్గొన్నారు.

జంక్ ఫుడ్‌తో పిల్లల్లో ఊబకాయం

పెందుర్తి: మండలంలోని పులగానివానిపాలెం, బ్యాంకు కాలనీ, నరవవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో 8వ రాష్ట్రీయ పోషణ్ మాసం కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఊబకాయం తగ్గించడంపై సూపర్‌వైజర్ వీవీ గీతాలక్ష్మి మాట్లాడుతూ నూనె, పంచదార, ఉప్పు వినియోగం తగ్గించుకోవాలన్నారు. పిల్లలకు జంక్ ఫుడ్స్ పెట్టకుండా పోషక విలువలు ఉన్న ఆహార పదార్థాలను అదించాలన్నారు.

గోశాల లేఅవుట్‌లో చోరీ

సింహాచలం: గోశాల లేఅవుట్‌లో గురువారం చోరీ జరిగింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాలు.. గోశాల లేఅవుట్‌లో బంటుబిల్లి మహేష్, అతని భార్య ఇందుమతి తమ సొంతింటి పై రెండు అంతస్తుల్లో నివసిస్తూ, గ్రౌండ్‌ఫ్లోర్‌ను అద్దెకు ఇచ్చారు. ఇందుమతి గురువారం సాయంత్రం ఇంటికి గడియపెట్టి పువ్వులు కోసేందుకు కిందికి వెళ్లింది. తిరిగి వచ్చిన ఆమె బెడ్‌రూమ్‌లోకి వెళ్లి బీరువా తెరిచి చూడగా బీరువాలో ఉండాల్సిన రూ.90 వేలు నగదు, 5 తులాల బంగారం, 10 తులాల వెండి కనిపించలేదు. దీంతో గోపాలపట్నం క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, క్లూస్‌టీమ్ వచ్చి పరిశీలించారు. క్రైమ్ ఎస్ఐ తేజేశ్వరరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.